ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 10 ఆగస్టు 2025

ట్రస్టు బోర్డు నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గార, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మనాథుని దేవస్థానం ట్రస్టు బోర్డు నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో కె.నరసింహనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు 20 రోజుల్లోగా సహాయ కమిషనర్ (శ్రీకాకుళం) లేదా శ్రీకూర్మ క్షేత్రం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చునని అన్నారు. ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఆలయ ప్రధాన అర్చకులు ఉంటారని పేర్కొన్నారు. మిగిలిన 9 మంది సభ్యులు నియామకం కోసం దరఖాస్తులను కోరుతున్నట్టు ఈవో తెలిపారు.

గిరిజన అభివృద్ధికి ప్రాధాన్యం

- రోడ్లకు రూ.8,400 కోట్లు కేటాయించాం
- మెళియాపుట్టిలోనే ఐటీడీఏ ఏర్పాటు చేస్తాం
- మంత్రి అచ్చెన్నాయుడు
- ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

పాతపట్నం/మెళియాపుట్టి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా గిరిజనాభివృద్ధికి ఎక్కడా వెనుకడుగు వేయడం లేదని, ఆదివాసీలకు మొదటి ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నామని వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం పాతపట్నంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్న పాల్గొని మాట్లాడారు. రెండేళ్లలోనే గిరిజన గ్రామాలన్నింటికీ రోడ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు కంకణం కట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే నిధులు మంజూరు చేసి పనులు చేపడుతున్నామని అన్నారు. '2014-2019 టీడీపీ పాలనలో గిరిజన రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు రాలేదు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి అనుమతులు తీసుకువచ్చాం. గత వైసీపీ ప్రభుత్వం గిరిజనులకు చేసిందేమీ లేదు. దీనివల్ల మళ్లీ డోలీ మోతలు కనిపించడం బాధకలిగించింది. మా సూచనలు సైతం గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఐటీడీఏకు వచ్చిన నిధులు సైతం దారిమళ్లించి గిరిజనులకు అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి అంశంగా గిరిజనాభివృద్ధినే తీసుకుంది. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజన రోడ్ల కోసం రూ.8,400 కోట్లు కేటాయించారు. రోడ్లు ఉంటేనే విద్య, వైద్యంతో పాటు మిగతా రంగాల్లో గిరిజనులు అభివృద్ధి చెందుతారు. మొదటి విడతగా వెయ్యి కోట్లతో వెయ్యి కిలోమీటర్ల రోడ్లు వేస్తున్నాం.విద్యుత్ సౌకర్యంలేని గ్రామాలకు రూ.2.50కోట్లు ఖర్చు చేసి వెలుగులు అందిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతీ గిరిజన గూడకు నెట్‌వర్క్ వచ్చేవిధంగా రూ.4కోట్లతో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేశాం. గిరిజనులకు ఉద్యోగాల కల్పనకోసం జీవో నెం.3ను తీసుకువచ్చినప్పటికీ కొన్ని అడ్డంకులవల్ల ఇది అమలు కాలేదు. ప్రత్యామ్నాయంగా నూతన జీవోను తీసుకురావడానికి ఆలోచిస్తున్నాం. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాకు ఐటీడీఏ లేకుండా చేసింది. మందసలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని, కాదు మెళియాపుట్టిలో పెడతామని కాలయాపన చేసింది. మేము మాత్రం గిరిజనులు అధికంగా ఉన్న మెళియాపుట్టిలోనే ఐటీడీఏ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఈ అంశం ప్రస్తుతం ఆర్థిక శాఖవద్ద పెండింగ్‌లో ఉంది. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛనులు ఇస్తున్నాం. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పింఛన్ల పెంపుతోపాటు ఉచిత గ్యాస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలు అమలు చేశామంటే ప్రజలపై ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవాలి.' అని మంత్రి అన్నారు.

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. జిల్లాలో 163 గిరిజన గ్రామాలకు రహదారి ఇబ్బందులు ఉన్నాయని గుర్తించామన్నారు. నిధులు మంజూరు చేసి రోడ్డు పనులు చేపడుతున్నామని (మిగతా 6వ పేజీలో..)



పాతపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు, గిరిజనులు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యేలు గోవిందరావు, రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్

డీజేలు.. యమ డేంజర్!

- భారీ శబ్దాలతో ఆరోగ్యానికి పెనుముప్పు.. మృత్యువాత
- హెచ్చరికలకే పరిమితమైన అధికార యంత్రాంగం
- కొన్నిచోట్ల స్వచ్ఛందంగా బ్యాన్ చేస్తున్న యువకులు
- వినాయక నవరాత్రుల్లో డీజే లేకుండా చేయాలని విన్నపం

డీజే శబ్దాలు ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పుగా మారాయి. వాటి నుంచి 60 డెసిబుల్స్‌ను మించి శబ్దం వస్తుండడంతో ప్రజలు వివిధ రుగ్మతల బారిన పడుతున్నారు. ముఖ్యంగా వినికిడి లోపానికి గురవుతున్నారు. కొన్నిసార్లు గుండెపోటుకు గురై ప్రాణాలు కూడా కోల్పోతున్నారు.

- జి.సిగడాం మండలం డీఆర్‌వలస గ్రామంలో డీజేలను నిషేధిస్తూ ఇటీవల గ్రామపెద్దలు, యువత సమావేశమై ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇక నుంచి గ్రామంలో ఏ వేడుకల్లోనూ డీజేలు వినియోగించకూడదని నిర్ణయించారు. అందరూ ఈ నిర్ణయానికి కట్టుబడి ఉండాలంటూ ప్రమాణం చేశారు. నిబంధనను అతిక్రమిస్తే పోలీసు కేసులు పెడతామని హెచ్చరించారు.

- ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగిన ఓ వివాహ వేడుకలో ఓ యువకుడు పాల్గొన్నాడు. ఊరేగింపులో భాగంగా డీజే సౌండ్ వద్ద డ్యాన్స్ వేశాడు. రాత్రికి ఇంటికి చేరుకున్న ఆయన అస్వస్థతకు గురయ్యాడు. గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించగా చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు.

- ఇటీవల వినికిడి లోపంతో ఎక్కువ మంది మా ఆస్పత్రికి వస్తున్నా రు. అందులో యువత అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. డీజేల వినియోగం, మితిమీరిన సెల్‌ఫోన్ వినియోగం, బ్లూటూత్, ఈయర్ ఫోన్స్ వాడడం వల్లే చెవికి సంబంధించి రుగ్మతలు ఎక్కువగా ఎదురవుతున్నాయి. ఆస్పత్రికి వచ్చే వారిలో వీటి బాధితులే అధికం.

-శ్రీకాకుళం నగరానికి చెందిన ఈఎన్‌టీ నిపుణుడు



డీజే వద్ద డ్యాన్స్ చేస్తున్న మహిళలు

రణస్థలం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వేడుక ఏదైనా డీజే శబ్దం సర్వసాధారణమైంది. పెళ్లిళ్లు, జన్మదినాలు, ర్యాలీలు, వేడుకలు ఇలా ఏ కార్యక్రమం అయినా డీజే మోత మోగాల్సిందే. గతంలో ఎక్కడో పబ్‌లకు పరిమితమైన ఈ సంస్కృతి ఇప్పుడు మారుమూల పల్లెలకు కూడా పాకింది. ఇప్పటికే వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం.. శబ్ద కాలుష్యంతో మరింత కలవరపాటుకు గురవుతున్నారు. ప్రస్తుతం శ్రావణమాసం వివాహాలకు తోడు..వినాయక నవరాత్రులు సమీపిస్తుండడంతో (మిగతా 6వ పేజీలో..)



డీఆర్‌వలసలో డీజేలను నిషేధిస్తూ ప్రమాణం చేస్తున్న గ్రామస్థులు

అసలు నిందితులు చిక్కట్లే!

- పోలీసులకు పట్టుబడుతుంది కేవలం గంజాయి రవాణాదారులే
- వ్యాపారులు, బ్రోకర్లు, సాగుదారులు తప్పించుకుంటున్న వైనం
- నిరంతరం నిఘాతోనే రవాణాకు అడ్డుకట్ట

- ఈ ఏడాది మే 15న సుజిత్ సూర్జియా అనే వ్యక్తి గంజాయి ప్యాకెట్లతో పోలీసులకు పట్టుబడ్డాడు. సుజిత్ గుణుపూర్-బరంపురం బస్సు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై కుటుంబాన్ని పెంచడానికి ఆదాయం సరిపడకపోవడంతో గంజాయి స్మగ్లరుగా అవతారం ఎత్తాడు. ఈ క్రమంలో పర్లాకిమిడి (ఒడిశా)కు చెందిన పుస్కో పోరిచా అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. 14 కిలోల గంజాయి ప్యాకెట్లను మహారాష్ట్ర పూణేలో ఉన్న జ్యోతి చవాస్ అనే వ్యక్తికి అప్పగిస్తే రూ.20వేలు ఇస్తానని సుజిత్‌కు పుస్కో పోరిచా చెప్పాడు. దీంతో గంజాయి బ్యాగును పలాస రైల్వే స్టేషన్‌కు తరలిస్తుండగా సుజిత్ పోలీసులకు పట్టుబడి జైలు జీవితాన్ని అనుభవిస్తున్నాడు. ఈయన కేవలం రవాణాదారుడు మాత్రమే. అసలు నిందితులు మాత్రం పట్టుబడలేదు.

- పలాస, టెక్కలి సబ్‌డివిజన్ పోలీసుశాఖ పరిధిలో గత మూడు నెలల్లో పదుల సంఖ్యలో గంజాయి కేసులు నమోదయ్యాయి. టన్నుకు పైగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించి ఇప్పటి వరకూ 50 మంది వరకూ నిందితులను అరెస్టు చేశారు. నిరంతరం నిఘాతోనే ఇది సాధ్యమైందని పోలీసులు చెబుతున్నారు. అయితే, కేవలం గంజాయి రవాణాదారులను మాత్రమే పోలీసులు పట్టుకొని జైలుకు పంపిస్తున్నారు తప్ప దీనికి మూలకారకులను ఇప్పటి వరకూ ఒక్కరిని కూడా అరెస్టు చేయకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దీన్ని ఛేదిస్తే మొత్తం గంజాయి రవాణాకు చెక్ పెట్టవచ్చని సాక్ష్యాత్తు పోలీసు అధికారులే చెబుతుండడం విశేషం.



- గత నెల 15న కాశీబుగ్గ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు మహిళలతో సహా మొత్తం నలుగురు గ్యాంగ్ పోలీసులకు పట్టుబడింది. 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిని జైలుకు పంపించారు పోలీసులు. వీరంతా కేవలం కిలోకు రూ.5వేలకు ఒప్పందం కుదుర్చుకొని గంజాయిని రవాణా చేస్తున్నవారే. బిహార్ రాష్ట్రానికి చెందిన వీరంతా ఒడిశాలోని గంజాయి తయారీదారుల నుంచి సరుకును కొనుగోలు చేసి, దాన్ని బ్రోకర్లకు అప్పగించే ప్రయత్నంలో పట్టుబడ్డారు.

పలాస, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఇచ్ఛాపురం, కంచిలి, మందస, పలాస, టెక్కలి, పాతపట్నం పోలీసు స్టేషన్ల పరిధిలో గత మూడు నెలల్లో పదుల సంఖ్యలో గంజాయి రవాణాదారులను పోలీసులు అరెస్టు చేశారు. వీరంతా ఒడిశా, బిహార్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన వారే. వీరంతా ఒడిశాలోని రాయఘడ బ్లాక్, మోహనసమితి, ఆర్ ఉదయగిరి ప్రాంతాల్లో విస్తృతంగా పండించే గంజాయిని (మిగతా 6వ పేజీలో..)

నేడు, రేపు వివిధ క్రీడాంశాల్లో జిల్లాస్థాయి ఎంపికలు

7లో

ఆర్టీసీ ఆస్తులు కార్పొరేట్లకు ధారాదత్తం చేయొద్దు

- ఈయూ జోనల్ కార్యదర్శి బి.కృష్ణమూర్తి

7లో

హమాలీల పొట్ట కొట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- ఎచ్చెర్లలో హమాలీల నిరసన

8లో

ఆదివాసీ సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటం

- ఆదివాసీ వికాస పరిషత్

8లో

అనురాగ బంధాన్ని పెంపొందించే రాఖీ పండుగ

- మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సోదరి, సోదరుల మధ్య అనురాగ బంధాన్ని పెంపొందించేది రాఖీ పండుగ అని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో పలువురు మహిళలు శనివారం ఆయనకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆయన రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. జీవితాంతం సోదర బంధం అండగా ఉండాలని ఆడబిడ్డలు కోరుకుంటుంటారని అన్నారు.

సెప్టెంబరు 23 నుంచి కొత్తమ్మతల్లి ఉత్సవాలు

కొత్తమ్మతల్లి ఉత్సవాలను సెప్టెంబరు 23 నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో అన్ని శాఖ అధికారులతో ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉత్సవాల విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. అరసవల్లి రథసప్తమి వేడుకలకు దీటుగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట డ్రోన్ కెమెరాలు, వీఐపీ గేట్లు, సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. క్యూలైన్లలో ఎప్పటికప్పుడు పెద్దలకు నీరు, పిల్లలకు పాలు అందేలా చూడాలన్నారు. ఎటువంటి ఘర్షణలు లేకుండా పోలీసులు, ఆలయ సిబ్బంది, వలంటీర్లు చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో ఎస్.కృష్ణమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, పార్టీ మండల అధ్యక్షుడు బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడుకు రాఖీలు కడుతున్న మహిళా నాయకులు

ఆదిలోనే సాగునీటి కష్టాలు

- జాడలేని వర్షాలు
- ఎండుతున్న పంట పొలాలు
- నీటి ఇంజన్లతో తడులు అందిస్తున్న రైతులు



సరుబుజ్జిలి మండలం నందికొండ గ్రామంలో నీరు లేక బీటలు వారిన వరి పొలం



గార వద్ద బైరిదేశి కాలువ ఇలా..



గార మండలం తోణంగి వద్ద నీరు లేక ఎండిపోతున్న వరి ఎదలు

సరుబుజ్జిలి/గార/రూరల్/రణస్థలం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతాంగాన్ని ఆదిలోనే సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. 15 రోజులుగా చినుకు జాడ లేక చాలా చోట్ల వరి నారు, పైరు ఎండిపోతుంది. కొందరు రైతులు చెరువులు, బావుల వద్ద నీటి ఇంజన్లను ఏర్పాటు చేసి తడులు అందిస్తూ వాటిని బతికించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కురవడంతో దుక్కిలు, దమ్ములు, కలుపుతీతలు, నారు వేయడం, విత్తనాలు, ఎరువులు తదితర వాటికోసం రైతులు ఎకరాకు సుమారు రూ.10వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చు చేసి వరి నాట్లు, ఎదలు వేశారు. ఇప్పుడు వానలు ముఖం చాటేయడంతో పాటు వేసవిని తలపించేలా ఎండలతో వరి పైరు ఎండిపోతుంది. వానలు పడకపోతే కష్టమేనని ఆందోళన చెందుతున్నారు.

- సరుబుజ్జిలి మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో సుమారు 5,215 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. వంశధార కుడి ప్రధాన కాలువ, పిల్ల కాలువల ద్వారా కొన్ని గ్రామాలకు సాగునీరు అందుతుంది. కానీ, ఎగువ ప్రాంతంలో ఉన్న నందికొండ, శ్రీరామవలస, వెన్నెలవలస, తాడికొండ, లక్ష్మీపురం, చిగురువలస, కండగూడ, దకరవలస, సుభద్రాపురం, తమ్మినాయుడుపేట గ్రామాల రైతులకు మాత్రం సాగునీటి కష్టాలు తప్పడం లేదు. కేవలం వర్షాధార భూములు కావడంతో అన్నదాతలు ఆకాశం వైపు చూడాల్సి వస్తోంది. చినుకు రాలకపోవడంతో పొలాలు బీటలు వారి వరి పైరు ఎండిపోతుంది. కొన్ని గ్రామాల రైతులు చెరువులు, వంశధార కుడి ప్రధాన కాలువలకు నీటి ఇంజన్లు ఏర్పాటు చేసి వరి పైరును కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

- గార మండలంలోని శివారు ప్రాంతాలైన గార, వమరవల్లి, కళింగపట్నం, తోణంగి, కొర్ని, కొర్లాం, బూరవల్లి పంచాయతీల రైతులకు సాగునీరు కష్టాలు తప్పడంలేదు ఈ ఏడు పంచాయతీల పరిధిలో సుమారు 12వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గతంలో శ్రీకాకుళం గ్రామీణ మండలం బట్టేరు-పొన్నాం గ్రామం వద్ద ఉన్న వంశధార నది నుంచి బైరిదేశి కాలువకు ఓపెన్‌హెడ్ చానల్ ద్వారా పుష్కలంగా సాగునీరు అందేది. వంశధార జలాశయం ప్రారంభమైన తరువాత ఈ ఓపెన్‌హెడ్ (మిగతా 8వ పేజీలో..)

ఆదివాసీ సంబరం


విద్యార్థినుల నృత్య ప్రదర్శన


స్టాల్స్ పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్న

- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- సంప్రదాయ నృత్యాలతో విద్యార్థుల సందడి
- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు

పాతపట్నం/మెళియాపుట్టి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి గిరిజనులు తరలి రావడంతో సందడి నెలకొంది. ముందుగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మార్కెట్ యార్డ్ ప్రాంగణం వరకూ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీయులంతా ఐక్యంగా ఉండాలి.. అప్పుడే హక్కులు సాధ్యమంటూ నినాదాలు చేశారు. అనంతరం గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి ఉట్టిపడేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


సంప్రదాయ వస్త్రధారణలో గిరిజనులు


ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన కూరగాయలతో వేసిన స్వాగతం ముగ్గును పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


పాల్గొన్న విద్యార్థులు, గిరిజనులు


గిరిజన విద్యార్థినుల థింసా నృత్యం

థింసా నృత్యం, కోలాటం, కోయి డాన్స్‌లు, మేమే గుర్రాలు, డప్పు వాయిద్యాల ప్రదర్శనలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వివిధ శాఖల ద్వారా ఉత్పత్తి అవుతున్న గిరిజన పంటలను ప్రదర్శించారు. జీసీసీ, ఐకేపీ, ఉద్యాన వన, అంగన్‌వాడీ వంటి స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ స్టాల్స్‌ను మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు పరిశీలించారు.

పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

- మంత్రి అచ్చెన్నాయుడు


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య పరిస్థితులతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం లాంటిదని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన శనివారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో 18 మంది లబ్ధిదారులకు రూ. 23,44,463 చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఇప్పటి వరకు టెక్కలి నియోజకవర్గంలో 81 మంది లబ్ధిదారులకు రూ.కోటి 30లక్షలు అందజేశామని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలకు అన్నివిధాలా మేలు చేసేలా పని చేస్తోందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధిని సైతం పక్కదారి పట్టించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుమారు రూ.400 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద అందించిందని తెలిపారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ నాయకుడు బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ బంధం

- జిల్లాలో సందడిగా రాఖీ పౌర్ణమి వేడుక
- సుదూరం నుంచి వచ్చిన అక్కలు, చెల్లెళ్లు

ఎక్కడో ఉన్న సోదరుల వద్దకు వెళ్లి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్న వారు కొందరైతే.. ఇతర రాష్ట్రాల్లో ఉన్నా పుట్టింటికి వచ్చి సోదరులతో ఆనందంగా గడిపిన వారు మరికొందరు! జిల్లాలో శనివారం రాఖీ పౌర్ణమి పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అక్కచెల్లెళ్లంతా వారి అన్నదమ్ములకు రాఖీలు కట్టారు. చాలా దూరంగా ఉన్నవారు వీడియోకాల్ చేసుకుని ముచ్చట్లు చెప్పుకున్నారు. అనుబంధాలు, ఆత్మీయతలను నెమరు వేసుకున్నారు. ఈ వేడుకలో జిల్లాలోని పలు దుకాణాలు కిటకిటలాడాయి. ఆలయాల్లో కూడా రద్దీ కనిపించింది.

అమెరికా, ఆస్ట్రేలియాలో ఉన్నా..


విదేశాల నుంచి పంపిన రాఖీలను కట్టించుకున్న వినయ్ సాయి

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాధాకృష్ణనగర్‌లో ఉన్న బి.వినయ్ సాయికి అమెరికా నుంచి ప్రియాంక అక్క, ఆస్ట్రేలియా నుంచి కీర్తన చెల్లి, లలిత, శిరీష, వినీష, చంద్రిక రాఖీలు పంపించారు. ఢిల్లీలో ఉన్న వంశీకి శ్రీకాకుళం నుంచి కావ్య రాఖీలను కొరియర్‌లో పంపించారు. శ్రీకాకుళం నగరం తుపాకుల బిల్డింగ్ వీధి నుంచి లావణ్య అమెరికాలో ఉన్న తమ్ముడు రాకేష్ ప్రతీ సంవత్సరం రాఖీ ముందుగానే పంపిస్తారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో అమెరికా నుంచి రాకేష్ వచ్చినప్పుడు లావణ్య ముందుగానే రాఖీ కట్టి ఆత్మీయతను పంచుకున్నారు.


విశాఖపట్నం వెళ్లి తన సోదరునికి రాఖీ కడుతున్న సోదరీమణులు

130 కిలోమీటర్లు ప్రయాణం చేసి..

నరసన్నపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మండలంలో పనిచేస్తున్న అక్కాచెల్లెళ్లు అయిన ముగ్గురు టీచర్లు కొండల లీలావతి, లత, జ్యోతి శనివారం 130 కిలోమీటర్లు వెళ్లి తమ సోదరుడు లక్ష్మణబాబుకు రాఖీ కట్టి సంబరాలు చేసుకున్నారు. లక్ష్మణబాబు విశాఖపట్నం వుడాకాలనీలో ఉంటున్నారు. ఈ ముగ్గురు అక్కాచెల్లెళ్లు గత నలభై సంవత్సరాలుగా రాఖీ కట్టేందుకు అన్నయ్య ఎక్కడ ఉన్నా అక్కడికే వెళ్తుంటారు. సంక్రాంతి కన్నా రాఖీ సంబరాల కోసమే ఏడాది అంతా ఎదురు చూస్తామని లీలా, లత, జ్యోతి తెలిపారు.


సరిహద్దులో రక్షాబంధన్ కార్యక్రమంలో దేశ సైనికులు

సరిహద్దుల్లో సైనికులు..

మెళియాపుట్టి ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న జిల్లా వాసులు శనివారం రక్షాబంధన్ ఘనంగా జరుపుకున్నారు. వీరు నేపాల్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉన్నారు. తమ దగ్గరలో ఉన్న పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో రాఖీలు కట్టించుకున్నారు.

అసలు నిందితులు చిక్కట్లే!

(ఐదో పేజీ తరువాయి)

వివిధ మార్గాల ద్వారా రవాణా చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో కిలో రూ.5వేలుకు కొనుగోలు చేసి నిర్దేశించిన ప్రాంతాలకు తరలిస్తుంటారు. కిలోకు సరుకు నాణ్యతబట్టి రూ.5వేలు నుంచి రూ.10వేలు వరకూ వారికి వ్యాపారులు ముట్టచెబుతారు. వ్యాపారులు మాత్రం కిలో రూ.40వేల వరకూ అమ్ముతుంటారని పోలీసులకు పట్టుబడిన వారు చెబుతున్నారు. గంజాయి వ్యాపారులు కొందరి గిరిజనులతో గంజాయిని సాగు చేయించి వారికి రెండింతల డబ్బులు ఇస్తుంటారు. వరికి బదులు పూలమొక్కల చాటున గంజాయి పండిస్తూ లాభాలు అర్జిస్తున్నారు. బ్రోకర్ల వ్యవహారం, వారి వివరాలు పోలీసులకు లభ్యమైనా గిరిజన గ్రామాల్లో వారిని పట్టుకోవడం కష్టసాధ్యమవుతుంది. ఒడిశా, ఆంధ్ర రాష్ట్రాల పోలీసులు, ప్రభుత్వాలు సంయుక్తంగా దాడులు చేస్తే తప్ప అసలు నిందితులు, పండించే రైతులు దొరకడం కష్టమే. కొద్ది రోజుల కిందట గంజాయి రవాణా ముఠా జిల్లా పోలీసులకు దొరికింది. ఆ ముఠా ద్వారా ఆర్.ఉదయగిరి ప్రాంతాల్లో గంజాయి పండించే రైతులు, బ్రోకర్ల వివరాలు లభ్యమయ్యాయి. పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు వారి చిరునామా తప్ప ఒక్కరు కూడా దొరకలేదు. వారం రోజుల పాటు ఆ ప్రాంతంలో నిఘా పెట్టినా వారి ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో పోలీసులు వెనుదిరగాల్సి వచ్చింది. సరిహద్దు ప్రాంతాలైన పాతపట్నం, మెళియాపుట్టి, మందస, ఇచ్ఛాపురం, కంచిలి మండలాలతో పాటు ఒడిశా సరిహద్దుల వెంట భారీగా పోలీసులను మోహరించడంతో పాటు అనుమానం వచ్చిన ప్రతీబ్యాగును తనిఖీ చేస్తే కొంతవరకు గంజాయి రవాణాను అరికట్టవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, అందుకు అవసరమైన పోలీసు సిబ్బంది లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. దీనికోసం సచివాలయ పోలీసు వ్యవస్థను వినియోగిస్తే కొంతవరకు ఫలితాలు ఉండవచ్చనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

గంజాయిపై ఉక్కుపాదం..



గంజాయిపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. గంజాయి రవాణా చేసినా, అమ్మినా తీవ్రమైన నేరంగా పరిగణిస్తాం. వీటితో పట్టుబడితే కనీసం పదేళ్ల జైలు, రూ.2 లక్షల అపరాధ రుసుం విధించడం జరుగుతుంది. గంజాయి రవాణా చేసి విలువైన జీవితాన్ని పాడుచేసుకోవద్దు. గంజాయి స్మగ్లర్లకు జైలు శిక్షతో పాటు వారి ఆస్తులు కూడా జప్తు చేస్తాం.

-పి.సూర్యనారాయణ, సీఐ, కాశీబుగ్గ

గిరిజన అభివృద్ధికి ప్రాధాన్యం

(ఐదో పేజీ తరువాయి)

తెలిపారు. నాలుగు వసతి గృహాలతోపాటు 26 నూతన అంగన్‌వాడీ కేంద్రాలను మంజూరు చేసినట్లు చెప్పారు. మెళియాపుట్టిలో ఎంఎస్‌ఎంఈ పార్కు మంజూరు చేశామన్నారు. ఇది ఏర్పాటయితే నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య తీరుతుందని అన్నారు. ఇప్పటి నుంచే స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టి నిరుద్యోగులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. గిరిజనులు పండించే పంటలకు ప్రోసెసింగ్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశాలిచ్చారని, దీనిపై చర్చించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ.. వెనుకబడిన నియోజకవర్గం పాతపట్నం అని, దీని అభివృద్ధికి అందరూ సహకరించి ముందుకు నడిపించాలని కోరారు. నిరుద్యోగ భృతి కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. తలసరి ఆదాయంలో వెనుకబడ్డామని, తమకు ప్రత్యేకనిధులు ఇచ్చి ఆదుకోవాలని విన్నవించారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఉద్దానం ఫేజ్-2 కింద రూ. 250కోట్లతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఉద్దానం ఫేజ్-2కు ఎర్రన్నాయుడు ప్రాజెక్ట్‌గా నామకరణం చేయాలని కోరారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డీడీ అన్నయ్య దొర, డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, గిరిజన సంఘ నాయకులు వాబ యోగి, భైరిసిండి లక్ష్మీనారాయణ, చల్లా శాంతారావు, రామారావు, మల్లిపురం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు గాజులతో అలంకరణ



నరసన్నపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంతోషి మాత ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి 11,111 గాజులతో అలంకరించారు 1,111 లడ్డూలను నైవేద్యంగా భక్తులు సమర్పించారు.

సంతోషిమాతను గాజులతో అలంకరించిన దృశ్యం

డీజేలు.. యమ డేంజర్!

(ఐదో పేజీ తరువాయి)

ఆందోళనకు గురవుతున్నారు. శబ్దాల మోత తప్పదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా మన చెవులు 120 నుంచి 130 డెసిబుల్స్ మాత్రమే భరించగలవు. అంతకు మించితే పెను ప్రమాదమే. మనం వింటున్న శబ్దం తీవ్రత పెరిగే కొద్దీ రుగ్మతలు ఖాయమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. 60 డెసిబుల్స్‌లోపు శబ్దం వింటే ఎటువంటి ఇబ్బందులుండవు. 100 డెసిబుల్స్ శబ్దం దాటితే గుండె జబ్బులు ఉన్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. 110 డెసిబుల్స్ దాటితే చికాకుతో పాటు విపరీతమైన కోపం, తలనొప్పి వస్తుంది. 120 డెసిబుల్స్ దాటితే చిరాకు, చర్మంపై రోమాలు నిక్కపొడుచుకోవడం, విపరీతమైన తలబాధ వస్తుంది. 160 డెసిబుల్స్ దాటితే చెవుల్లో వినికిడి కణాలపై ప్రభావం చూపుతాయి. నరాలు దెబ్బతిని పాక్షిక వైకల్యం కలుగుతుంది. 190 డెసిబుల్స్ శబ్దం దాటితే కర్ణభేరి పగిలిపోతోంది. శాశ్వతంగా వినికిడి శక్తి కోల్పోతారు. పూర్వపు స్థితి రావడం చాలా కష్టం.

సరికొత్తగా సిస్టమ్స్..

జిల్లాలో డీజేలను రకరకాల రీతిలో నిర్వాహకులు తీర్చిదిద్దుతున్నారు. చివరకు డ్యాన్స్ వేసే యువత నీటి పాటల కోసం ఏకంగా స్ప్రింకర్ల మాదిరిగా ఏర్పాటు చేస్తున్నారు. వాటిలోనే రసాయనాలతో కూడిన రంగు నీరును కలుపుతున్నారు. ఇది ఏమాత్రం కంటిలోకి వెళ్లినా ప్రమాదకరమే. డీజేల నిర్వాహకులు కానీ.. శుభ కార్యాల పెద్దలు కానీ పట్టించుకోవడం లేదు. డీజే బాక్సుల నుంచి వచ్చే వైబ్రేషన్ చాలా ప్రమాదకరం. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక రుగ్మతలు ఉన్నవారిపై విపరీతంగా ప్రభావం చూపిస్తుంది. ఆ వైబ్రేషన్‌తో నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. మెదడుకు రక్త సరఫరా తగ్గిపోతుంది. గుండెకు రక్తం సరఫరా చేసే నాళాలు మూసుకుపోతాయి. గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గర్భిణులకు సైతం డీజే వైబ్రేషన్స్ ప్రమాదకరమే. అధిక శబ్దాలు వింటే గర్భస్థ పిండంపై పెను ప్రభావం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే అటువంటి ప్రమాదకరమైన డీజేలను నిషేధించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

చర్యలు తీసుకోకుంటే ప్రమాదమే..

శ్రావణమాసం కావడంతో ప్రస్తుతం జిల్లాలో వివాహాలతో పాటు శుభకార్యాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ నెల 28న వినాయక నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. దీంతో ఇప్పటి నుంచే మండపాల నిర్వహణ, భారీ విగ్రహాల ఏర్పాటు, డీజేలు, మైకులకు హడావుడి చేస్తుంది యువత. ఇటువంటి సమయంలోనే పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టకపోతే ఇబ్బందికర పరిస్థితులు తప్పవు. డీజే సౌండ్ సిస్టమ్‌తో కలుగుతున్న అనర్థాలను గుర్తించి ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల్లో వాటిని నిషేధించాలి. నివాసిత ప్రాంతాలు, వ్యాపార సముదాయాల్లో సౌండ్ సిస్టమ్స్ సామర్థ్యాలను తగ్గించాలి. పరిశ్రమల్లో పనిచేసే చోట సైతం యంత్రాల నుంచి శబ్ద కాలుష్యం వస్తుంది. అటువంటిచోట కార్మికులు, ఉద్యోగులకు ఇయర్ మాస్కులతో పాటు బడ్స్ ఇవ్వాలి. గుండె సంబంధిత సమస్యలు ఉన్న వారు డీజే సిస్టమ్స్ వద్దకు అస్సలు వెళ్లకూడదు. అసౌకర్యం కలిగించే శబ్దాలు వినకుండా చెవుల్లో బడ్స్, దూది పెట్టుకోవాలి.

డీజేలపై నిషేధం..

జిల్లాలో డీజేల వినియోగం నిషేధం. వివాహాలు, శుభకార్యాల్లో డీజేల శబ్దంతో ఇబ్బందులు తెచ్చిపెడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. యువత సైతం తమ బైకులకు అధిక శబ్దం ఇచ్చే సైలెన్సర్లు వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా అధిక శబ్దం ఇచ్చే సైలెన్సర్లను అమర్చిన వారు వాటిని తొలగించాలి. లేకుంటే జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదుచేస్తాం. డీజేలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం.

-ఎం.అవతారం, సీఐ, జేఆర్‌పురం


శ్రీచక్రాల వద్ద కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

దేవీ ఆశ్రమంలో ఘనంగా పౌర్ణమి పూజలు

- వేలాది మంది మహిళలతో కుంకుమార్చనలు

ఎచ్చెర్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కుంచాల కురమయ్యపేటలోని దేవీ ఆశ్రమం (శ్రీ చక్రపీఠం)లో శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కర శర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి దేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేలాది మంది మహిళలు శ్రీచక్రాల వద్ద కుంకుమ పూజలు చేసి భక్తిని చాటుకున్నారు. మహా మేరువునకు ప్రత్యేక హారతి ఇచ్చారు. పలువురు భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించారు.


రాజరాజేశ్వరిదేవికి హారతి ఇస్తున్న దృశ్యం

ఆర్టీసీ ఆస్తులు కార్పొరేట్లకు ధారాదత్తం చేయొద్దు

- ఆర్టీసీ ఈయూ జోనల్ కార్యదర్శి బి.కృష్ణమూర్తి

అరసవల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్టీసీ ఆస్తులను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తే సహించేది లేదని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) జోనల్ కార్యదర్శి బి.కృష్ణమూర్తి స్పష్టం చేశారు. శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విజయవాడ నడి బొడ్డున ఉన్న సుమారు రూ.400 కోట్ల విలువైన ఆస్తులను కార్పొరేట్లకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండడం దారుణమన్నారు. దశాబ్దాలుగా ప్రజలకు 200 బస్సులతో రవాణా సదుపాయం కల్పిస్తున్న 1100 మంది ఉద్యోగులను ప్రజలకు దూరం చేసే ప్రక్రియను విరమించుకోవాలని డిమాం డ్ చేశారు. తక్షణం లూలూ మాల్‌కు కేటాయించిన జీవో నెం. 137ను రద్దు చేయాలని కోరారు. లులూ షాపింగ్ మాల్‌ను నగర శివార్లలో ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందు తుందన్నారు. ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుపరం చేసే నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని లేకుంటే ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్ర మంలో సంఘం జిల్లా కార్యదర్శి దశరథుడు, కోశాధికారి పీవీ ఆర్ లలితకుమారి, వన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు జీవీమూర్తి, ఎస్‌వీరమణ, టు డిపో అధ్యక్ష, కార్యదర్శులు బీఆర్ కృష్ణ, కె.బాబూరావు, టెక్కలి, పలాస డిపో నాయకులు కేవీరావు, ఎస్‌ఎం.రావు, ఎంఏరాజు, ఏడీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్టీసీ ఈయూ జోనల్ కార్యదర్శి కృష్ణమూర్తి

యూరియా కొరతతో రైతులు అల్లాడుతున్నారు?

- కేటాయింపులో పక్షపాత ధోరణి తగదు
- మండల సమావేశంలో సభ్యుల ఆవేదన

పొందూరు, ఆగష్టు 9(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, మండలానికి యూరియా కేటాయింపులో పక్షపాత ధోరణి దారుణమని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలవలస, తుంగపేట సర్పంచ్‌లు బుడుమూరు పోలినాయుడు, వేణుగోపాలరావు మాట్లాడుతూ.. జిల్లాలో ఏ మండలానికి రాని ఎరువులు, యూరియా కొరత పొందూరు మండలానికే ఎందుకు వచ్చిందని, దీనికి మంత్రి అచ్చె న్నాయుడు, వ్యవసాయాధికారులే కారణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికీ మండలంలో కొన్ని గ్రామాలకు యూరియా కేటాయించలేదన్నారు. కొన్ని నియోజక వర్గాలకు మండల లోడ్ల ఎరువులు కేటాయించిన అధికారులు పొందూరుకు చాలీ చాలని కేటాయింపులు ఎందుకు చేశారని ఏవో శ్రీనివాసరావును ప్రశ్నించారు. ఎరువుల కొరతపై ప్రశ్నిస్తున్న రైతులకు మేం ఏం సమాధానం చెబుతామని టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండిపడ్డారు. మండలంలో ఎరువుల కొరత సృష్టించడంపై జిల్లా యంత్రాంగంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఎరువుల పంపిణీపై నిర్లక్ష్యం ప్రద ర్శించిన సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లపై ఏం చర్యలు తీసుకున్నారని ఏవోను ప్రశ్నించారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేష్, ఎంపీడీవో మన్మథరావు, పలువురు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. పీఏసీఎస్ ఛైర్మన్‌గా నియమితులైన మండల ప్రత్యేక ఆహ్వానితుడు వండాన మురళిని అధికారులు, మండల పరిషత్ సభ్యులు సత్కరించారు.


ఎరువుల కేటాయింపులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పోలినాయుడు

కుల సంఘాల అభివృద్ధికి సహకారం: శంకర్

గార రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఒక్క కుల సంఘం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సహకరిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అంపోలు పంచాయతీ పరిధిలో ఉన్న జిల్లా జైలు రోడ్డు దారిలో రూ.40 లక్షలో నిర్మించనున్న వెలమ సంక్షేమ సంఘం నూతన భవన నిర్మా ణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైన సహాయ సహకరారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, వైసీపీ యువ నాయకుడు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, అంపోలు మాజీ సర్పంచ్ గొండు వెంకటరమణమూర్తి, పలువురు వెలమ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శిథిలావస్థలో తాగునీటి ట్యాంకులు


ఎకువూరులో ట్యాంకు పైభాగానికి వెళ్లేందుకు నిర్మించిన మెట్లు పాడైన దృశ్యం

సోంపేట రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉద్దానం తీర ప్రాంత గ్రామాల ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని లక్ష్యంతో దశాబ్దాల కిందట నిర్మించిన వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అవి ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ప్రజలు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. హిర మండలం రిజర్వాయర్ నుంచి తాగునీరందించే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం ఎకువూరు, ఎర్రముక్కాం, ఇసుకలపాలెం, రామయ్యపట్నం, గొలగండి, బాతుపురం, మాకన్నపల్లి తదితర గ్రామాల్లో నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. అయితే వాటర్ ట్యాంక్ పైకెక్కి నీటి శుద్ధి చేసేందుకు నిర్మించిన మెట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. పైగా పెచ్చులూడి పడుతుండ డంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి ఉందని, దీంతో ట్యాంకులు ఎలా శుభ్రం చేస్తారని స్థానిక మహిళలు ప్రశ్నిస్తు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకుల మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై రూరల్ వాటర్ సప్లై విభాగం జేఈ విష్ణుమూర్తి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా శిథిలావస్థకు చేరిన ట్యాంకులు రెండు నెలల్లో మరమ్మతులు చేసేలా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామన్నారు.



కంచిలిలో జోరు వాన

కంచిలి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలం జలంత్రకోట, బూరగాం జాతీయ రహదారిలో శనివారం భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉక్కపోతకు గురైన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కుర వడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షంతో వరి నాట్లు వేసేందుకు అవకా శం ఉంటుందని రైతులు అభిప్రాయపడు తున్నారు.


బూరగాం జంక్షన్ హైవేపై కురుస్తున్న వర్షం


వాళ్లేపేటలో వాహనం ద్వారా రేషన్

లావేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గుమడాం పంచాయతీ వాళ్లేపేటలోని లబ్ధిదారులకు ప్రత్యేక వాహనం ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ గ్రామంలో రేషన్ షాపు లేకపోవడంతో సమీపంలోని గుమడాం నుంచి ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులను తీసుకుంటారు. ఈ గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసిన టీడీపీ మండల యూత్ లీడర్ మజ్జి రామ్మూర్తి తన సొంత ఖర్చులతో వాహనాన్ని ఏర్పాటు చేసి గ్రామంలోనే డీలర్ ద్వారా అందించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

అరసవల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతీ ఇంటిపై మువ్వ న్నెల జెండా ఎగరాలని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పీఎం జే బాబు అన్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని షిర్డీసాయినగర్ పార్కు వద్ద స్థానిక సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా, హర్ ఘర్ స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13 నుంచి 15 వరకు జిల్లా వజ్రోత్సవాలు జరుగుతున్నాయని, అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని, ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు.











నేడు, రేపు వివిధ క్రీడాంశాల్లో జిల్లాస్థాయి ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో పది క్రీడాంశాల్లో జిల్లాస్థాయి ఎంపికలకు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డా.కె.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాడ్మింటన్ విభాగానికి 19 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. మిగతా క్రీడాంశాలకు 22 సంవత్సరాల లోపు అర్హులని పేర్కొన్నారు. పురుషులు, మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆర్చరీ విభాగానికి ఆదివారం ఎంపికలుంటాయని, దీనికి గాను లోపింటి చిట్టిబాబు (9440677201)ను సంప్రదించాలన్నా రు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాక్సింగ్ క్రీడా పోటీలు సోమవారం నిర్వహి స్తున్నామన్నారు. ఈ పోటీలకు గాను మణికుమార్ (9704934926)ను సంప్రదించాలని కోరారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో ఈనెల 14, 15వ తేదీల్లో జరగనున్న జోనల్‌స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు.

75వ వసంతోత్సవ క్రీడల్లో మార్పు

జిల్లా ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా నిర్వహించనున్న వాలీబాల్, కబడ్డీలకు బదులుగా ప్రాచీన క్రీడలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డా.కె.శ్రీధర్ తెలిపారు. పురుషులకు, మహిళలకు కర్రసాము, పురుషులకు సంగిడీలు, ముద్దార్, పిల్లి మొగ్గల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు ఈనెల 14న కోడిరామ్మూర్తి స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ప్రాచీన క్రీడలు జిల్లాస్థాయిలో మాత్రమే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని క్రీడాకారులు గమనించాలని కోరారు.

అన్నమయ్య కీర్తనలతో ఆధ్యాత్మిక సేవ

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య కీర్తనలతో ఆధ్యాత్మిక సేవ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. 42 రోజుల పాటు దీక్షగా వివిధ దేవాలయాల్లో అన్నమయ్య సంకీర్తన గానం చేసిన ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ కె.ఉమామహేశ్వరరావును శనివారం అభినందించారు. కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంగీతంతో ఏదైనా సాధించవచ్చని, ప్రతి ఒక్కరు అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తే నైతిక విలువలు పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధి బెహరా నాగేశ్వరరావు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ బి.జగన్మోహనరావు తదితరులు పాలొన్నారు.

క్రమశిక్షణతో కూడిన బోధన చేయాలి

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో చదివే విద్యార్థులకు క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం, విలువలతో కూడిన బోధన చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ సూచించారు. శనివార జడ్పీ సమావేశ మందిరంలో ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ సంక్షేమశాఖ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్ల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాతన చరిత్రలు చూస్తే గురుకులాల్లో చదువు, క్రమశిక్షణ, అనేక విషయాలనే బోధించి వారికి సమాజంలో మంచి పౌరులుగా తయారుచేశారని గుర్తుచేశారు. హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచడం, రుచికరమైన భోజనాన్ని అందించడం, ఆరోగ్యకరమైన పరిసరాలు ఉండేలా చర్యలు చేపట్టా లన్నారు. హాస్టళ్ల వార్డెన్లు విధిగా తాము పనిచేసే చోట నివాసం ఉండాలని స్పష్టం చేశారు. ప్రతిభ, పనితీరు, నిర్వహణ, పరీక్ష ఫలితాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని హాస్టళ్లు, గురుకులాలకు ర్యాంకులు కేటాయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ, ఇన్‌చార్జి విశాఖ బీసీ వెల్ఫేర్ అధికారి కె.రామారావు, రాష్ట్ర డైరెక్టర్ డి.చంద్రశేఖర్, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల డైరెక్టర్ పి.మాధవీలత, జేడీ చినబాబు, ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కోర్ కమిటీ సమావేశం

రణస్థలం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కోర్ కమిటీ సమావేశం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటన, తిరంగా ర్యాలీ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అట్టాడ రవిబాబ్జీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శవ్వాన ఉమామహేశ్వరి, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతు పాపారావు, పేడాడ సూరన్నాయుడు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తదితరులు

















సోదర బంధానికి అద్దం పట్టే రాఖీ పండుగ


పాతపట్నం: ఎమ్మెల్యే గోవిందరావుకు రాఖీ కడుతున్న బ్రహ్మ కుమారీలు


పలాస రూరల్: సత్యసాయి విద్యావిహార్‌లో...


నరసన్నపేట: విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

పాతపట్నం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సోదర బంధానికి అద్దం పట్టేది రాఖీ పండుగ అని పలువురు ప్రముఖులు అన్నారు. మండల వ్యాప్తంగా రాఖీ పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో సైతం రాఖీ పండగ ను ఉత్సాహంగా నిర్వహించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేదికపై పట్టణానికి చెందిన బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లకు రాఖీలు కట్టారు.

పలాస మండలంలో..

పలాసరూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పలాస మండలంలో శనివారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా గ్రామాల్లో మహిళలు పూజలు చేసి సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలను తినిపించారు. ఆలయాల్లో పూజలు చేశారు. సత్యసాయి విద్యావిహార్‌లో రాఖీ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు.

వసతి గృహాల్లో ...

నరసన్నపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ, ఎస్సీ బాలికల సంక్షేమ వసతిగృహాల్లో శనివారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రక్షాబంధన్ ప్రాముఖ్యతను వసతిగృహ అధికారిణిలు పద్మ, సూర్యప్రభలు విద్యార్థులకు తెలియజేశారు.


అరసవల్లి: వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణకు రాఖీ కడుతున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు


ఇచ్ఛాపురం: భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో రాఖీలు కట్టుకుంటున్న చిన్నారులు


కవిటి: రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే బెండాళం అశోక్‌కు రాఖీ కడుతున్న మహిళ

క్రైం కార్నర్ — చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి


అప్పలనాయుడు మృతదేహం

నరసన్నపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): లుకలాం గ్రామానికి చెందిన పిల్ల అప్పలనాయుడు (66) శనివారం పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పలనాయుడు అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వారం రోజులుగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. కుమారుడు ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా బలరామ జయంతి


నాగలి, వరి దుబ్బునకు పూజలు

పలాసరూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తర్లాకోట, పండాశాసనం, రెంటికోట గ్రామాలతో పాటు పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఒడియా బ్రాహ్మణుల ఆధ్వర్యంలో శనివారం బలరామ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాముడి ఆయుధమైన నాగలి, వరిదుబ్బులకు జంధ్యం, నూతన వస్త్రాలను సమర్పించారు. పండ్లు, పిండివంటలతో పూజలు చేపట్టారు. నాగళ్లకు పూజలు చేసిన అనంతరం వాటిని పొలాలకు తరలించి పనులు చేపట్టారు.

వేంకటేశ్వరునికి విశేష అలంకరణ


అలంకరణలో వేంకటేశ్వరుడు

నరసన్నపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం శ్రావణ పౌర్ణమి, శ్రవణం నక్షత్రం సందర్భంగా స్వామికి విశేష అలంకరణ చేపట్టారు. స్వామి జన్మ నక్షత్రం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

పెంటూరులో...


వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు

నందిగాం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పెంటూరులో కొలువై ఉన్న గోదాదేవి, మహాలక్ష్మీదేవి సమేత వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పౌర్ణమితో పాటు స్వామివారి జన్మనక్షత్రం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున ధర్మకర్తలు బొడ్డ జనార్దనరావు, కృష్ణారావు, నారాయణరావుల ఆధ్వర్యంలో అర్చకులు పీసపాటి రాజగోపాలాచార్యులు స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

నేడు షిర్డిసాయి ఆలయ వార్షికోత్సవం

నరసన్నపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కలివరపుపేటలో గల షిర్డిసాయి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా అన్నదానం చేయనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు సత్యానందం తెలిపారు.

సంతోషిమాతకు ఘనంగా పూజలు


సంతోషిమాతకు పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బెల్లుపడ కాలనీ సమీపంలో కొలువుతీరిన సంతోషిమాత ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతీ ఏటా శ్రావణ పౌర్ణమి రోజున ఈ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకుల తెలిపారు. వేకువ జామునుంచే అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

కాశీబుగ్గలో..

పలాసరూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఎల్‌సీ గేటు సమీపంలో ఉన్న సంతోషిమాత ఆలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం చేశారు. సాయంత్రం కుంకుమ పూజలు, తిరువీధులు నిర్వహించారు.

ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలి


మాట్లాడుతున్న హరిప్రసన్న

పొందూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న డిమాండ్ చేశారు. శనివారం సంఘం కార్యాలయంలో ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధనేతర పనులను ఉపాధ్యాయులపై రుద్దడం దారుణమన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు గండెం రామారావు, చౌదరి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల విధానంపై పునరాలోచించాలి

టెక్కలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఈ విద్యా సంవత్సరం నుంచి పరీక్ష జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి యాప్‌లో నమోదు చేసే నూతన ప్రక్రియ విధానంపై విద్యాశాఖ అధికారులు పునరాలోచించుకోవాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ రూపొందించిన విధానం మంచిదైనప్పటికీ ఉపాధ్యాయుల్లపై అదనపు భారం పడుతుందన్నారు. ప్రాథమిక స్థాయి పాఠశాలల్లో ఒక్కొక్క ఉపాధ్యాయులు ఉన్నారని.. అలాంటి చోట్ల ఈ విధానం భారంతో కూడుకున్నదని అన్నారు. ఉన్నత పాఠశాలల్లో కనీసం కార్యాలయ సిబ్బంది కూడా ఉండరని, అటువంటి పాఠశాలల్లో ప్రగతిపత్రం నమోదు, అప్‌లోడ్ చేయడం సాధ్యం కాదని ఆయన తెలిపారు.

ఆదివాసీ సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటం


వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

మందస, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సమస్యల పరిష్కారానికి గిరిజనులు ఐకమత్యంగా పోరాటం చేయాలని ఆదివాసీ వికాస పరిషత్ మండల అధ్యక్షుడు సవర జగన్నాయకులు అన్నారు. మందస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా మందస పట్టణంలో ర్యాలీ చేపట్టి బిర్సాముండా, కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజుల చిత్రపటాలకు నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, భూఆక్రమణలు ఆపాలని, నకిలీ గిరిజన ధ్రువపత్రాలను నిలిపి వేయాలని కోరారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు సవర చంద్రరావు, సవర చంద్రమ్మ, గణేశ్వరరావు, జనసేన నాయకులు సంతోష్‌పండా, ఎస్.రాంబాబు, చొక్కారావు, డొంబురు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

నీలమణిదుర్గ సన్నిధిలో మంత్రి అచ్చెన్న


పూజలు చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పాతపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం శ్రీనీలమణి దుర్గ అమ్మవారిని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవ దాయశాఖ సిబ్బంది ఆయనను సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రి దృష్టికి ఓబీసీల సమస్యలు


కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో ఓబీసీ నాయకులు

పోలాకి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఓబీసీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి తదితరుల దృష్టికి తీసుకువెళ్లినట్టు ఓబీసీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి తులసిపాటి కృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, తదితరులతో ఓబీసీ రాష్ట్ర కమిటీ బృందం స్వయంగా కలిసి సమస్యలు వివరించినట్టు ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

శ్రీకాకుళం అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతి రావు, ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఉదయం 5.30 గంటలకు విధులను నిలుపుదల చేసి టూల్స్ డౌన్ చేసి నిరసన తెలిపారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని వీరంతా కోరారు. పర్మినెంట్ కార్మికులకు ఇంక్రిమెంట్లు, సరెండర్ లీవ్‌లు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లలకు తల్లికి వందనం, అంబేడ్కర్ విదేశీ విద్య దీవెన పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జె.గురుమూర్తి, ఎస్.పార్థసారథి, ఆర్.గణేష్, అర్జి పెద్దమణి, గోపిబాబు, గురుస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలోనే సాగునీటి కష్టాలు

(ఐదో పేజీ తరువాయి)

చానల్‌ను అధికారులు పట్టించుకోకపోవడంతో శివారు ప్రాంత రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. దీనికి తోడుగా కాలువ పరిస్థితి దారుణంగా తయారైంది. పూడికలు పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో శివారు ప్రాంతానికి అరకొరగానే నీరు చేరుతుంది. తుప్పుపట్టి రంధ్రాలు ఏర్పడిన షట్టర్ల కారణంగా ఆ కాస్త నీరు కూడా భూములకు చేరడం లేదు. దీంతో ఎదలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

- రణస్థలం మండలంలో గత 15 రోజులుగా వర్షాలు కురవకపోవడంతో వరి పొలాలు ఎండుతున్నాయి. మండలంలో ఈ ఏడాది 5వేల ఎకరాల్లో వరిసాగు చేయాల్సి ఉండగా, వర్షాభావంతో ఇప్పటి వరకు 2,500 ఎకరాల్లో మాత్రమే ఉభాలు జరిగాయి. అయితే, ఒకపక్క వర్షాలు కురవక, మరోపక్క తీవ్రమైన ఎండలకు, ఇంకొకపక్క తోటపల్లి సాగునీటి కాలువ ద్వారా నేటికీ నీరు విడుదల కాకపోవడంతో వరి పైరు ఎండిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు విడిచిపెట్టాలని రైతులు కోరుతున్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేత కార్మికులు

గార రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నేత కార్మికులకు సీఎం చంద్రబాబు భరోసా కల్పించడంపై వారు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు అంపోలులోని అగస్త్యేశ్వర ఆధునిక వస్త్రోత్పత్తి విభాగం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షు రాలు గొండు స్వాతి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి కార్మికులు చెల్లించాల్సిన 5 శాతం జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రకటించి సీఎం చంద్రబాబు వారందరికీ భరోసా కల్పించారన్నారు. ఆప్కో చైర్మ న్ కాసిన ప్రసాదరావు మాట్లాడుతూ.. నేతన్న భరోసా పథకం ద్వారా సంవత్సరానికి రూ.27 వేలు ప్రతి కుటుంబానికి చెల్లించడం కార్మికులకు ఎంతో ప్రయోజనమన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంపై నేతన్నలు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు గొండు రమణమూర్తి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొండు అచ్యుతరావు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో..

సంతబొమ్మాళి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తమకు ఆర్థిక భరోసా కల్పించిన సీఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చిత్రపటాలకు సంతబొమ్మాళి చేనేత కార్మికులు శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్మికుల కష్టాలు తీర్చిన సీఎం చంద్రబాబుతో పాటు రాష్ట్ర, కేంద్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ పద్మశాలి సంఘ డైరెక్టర్ కూశెట్టి కాంతారావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కూశెట్టి భానుప్రకాష్, పప్పు కృష్ణారావు, దశరథ తదితరులు పాల్గొన్నారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

హమాలీల పొట్ట కొట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి


ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలుపుతున్న హమాలీలు

ఎచ్చెర్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బేవరేజస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాట్లింగ్ యూనిట్ ను విభజించి ఇక్కడి హమాలీల పొట్టకొట్ట వద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. ఈ మేరకు శనివారం మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎచ్చెర్లలో యూనిట్ ఏర్పాటు సమయంలో దళితులు తమ భూములను ఇచ్చారని, అప్పటి నుంచి వారే హమాలీలుగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పుడు ఈ యూనిట్‌ను విభజించి టెక్కలిలో మరో కేంద్రం ఏర్పాటు వల్ల ఇక్కడి హమాలీలు జీవనాధారం కోల్పోతారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని హమాలీలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో హమాలీల యూనియన్ నాయకులు దుప్పాడ బంగార్రాజు, టి.రామారావు, ఎం.సురేష్, నిడిగింట్ల రమణ, బోనెల రాము, లింగాల రాము, గురుమూర్తి, సీతారాం తదితరులు పాల్గొన్నారు. ● సమస్యను పరిష్కరించాలని కోరుతూ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావులను హమాలీలు కలిసి విన్నవించారు. కార్యక్ర మంలో మాజీ సర్పంచ్ మెండ రాజారావు, మాజీ ఉప సర్పంచ్ మూకళ్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వంశధార నదికి తగ్గుతున్న నీరు


గొట్టా బ్యారేజి వద్ద ఇలా..

హిరమండలం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గొట్టాబ్యారేజీ కుడి,ఎడమ ప్రధాన కాలువల పరిధిలో ఆయకట్టు రైతులకు వంశధార నీటిని పూర్తి స్థాయిలో అందించలేని పరిస్థితి ఏర్పడింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో బ్యారేజీకి ఇన్‌ఫ్లో తక్కువగా వస్తోంది. ఆయకట్టు భూములకు పుష్కలంగా సాగునీరు అందించాలంటే బ్యారేజి వద్దకు ఇన్‌ఫ్లో 2,800 క్యూసెక్కులు రావలసి ఉంది. వర్షాలు లేకపోవడంతో క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి తగినంత నీటి ప్రవాహం రాకపోవడంతో కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా అవసరమైన నీటిని విడిచిపెట్టలేకపోతున్నారు. శనివారం సాయంత్రానికి బ్యారేజి వద్దకు 2,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వస్తోంది. ఎడమ కాలువ ద్వారా 1,770, కుడి కాలువ ద్వారా 465 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో తక్కువగా వస్తుండటంతో రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని డీఈఈ సరస్వతి సూచించారు. ప్రస్తుతం వర్షాలు పడకపోతే నీటి విడుదల మరింత తగ్గించనున్నట్టు చెప్పారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ

సంతబొమ్మాళి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దండుగోపాలపురానికి చెందిన నర్సిపురం మోహిత్‌కు వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.45,178 చెక్కును మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం అందజేశారు. గత ఏడాది తోటి విద్యార్థులతో వాలీబాల్ ఆడుతుండగా మోహిత్ చేతికి గాయమై శస్త్ర చికిత్స జరిగింది. వైద్యఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సాయం అందజేయడం పట్ల మాజీ సర్పంచ్ ఆరంగి వసంతరావు, మండల ఐటీడీపీ అధ్యక్షుడు బెండి అరుణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

దుకాణాల్లో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

సోంపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి మాదక ద్రవ్యాలు అధికంగా పట్టుబడుతున్న వేళ సోంపేట ఎస్ఐ వి.లవరాజు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్ లోని షాపులు, ఇతర ప్రాంతాల్లోనూ జాగిలాలతో అనువణువూ తనిఖీ చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.